అర్హులందరికీ పథకాలు అందేలా కృషి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పేర్కొన్నారు. గోల్నాకలోని క్యాంపు కార్యాలయంలో 35 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.14.90 లక్షల ఆర్థిక సాయం మంజూరు కాగా సంబంధిత చెక్కులను వారికి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుల లింగారావు, శ్రీనివాస్‌గౌడ్, రెడ్డపాక రాము తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న నాగభూషణం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు విభూది నాగభూషణం మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీ బాలగౌడ్ శిష్యుడైన నాగభూషణం గతంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో చేరారు.అయితే గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో హైదరాబాద్ నగర ఉపాధ్యక్షులు, హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా పని చేయడంతో పాటు, ఓబీసీసెల్ రాష్ట్ర కన్వీనర్, మీడియాసెల్ రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేశారు. బీఆర్ఎస్‌లో చేరినప్పటికి అక్కడ పరిస్థితులు అనుకూలించకపోవడంతో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, కల్పనయాదవ్, అంజి యాదవ్,నవీన్ నాయక్, లింగాల శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

టీబీఎస్ఎస్ ప్రతినిధి మృతి



ఊరే వెంకట రామారావు(ఫైల్)

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్ఎస్) ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది ఊరే వెంకట రామారావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీబీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణా రావు శనివారం రామారావు నివాసానికి వెళ్లి పార్థీవ దేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీబీఎస్ఎస్ ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, చెన్నూరు లక్ష్మీనరసింహా రావు, కానాల శ్యామసుందర్ రావు, ఊరే ప్రసాద్ రావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ముషీరాబాద్: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌లోని గంగపుత్ర సంఘం కమ్యూనిటీహాల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలు నివసించే ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఎస్ఆర్‌డీ, జనహిత సంస్థలను ఆయన అభినందించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో శ్రీనివాస్, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహామూర్తి, వెంకట నారాయణ, నందకుమార్, ఇందిరాభారతి, శివరాణి, వెంకటేశ్వరి పాల్గొన్నారు.

కేటీఆర్‌పై ఫిర్యాదు

చిక్కడపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది భానుచందర్ చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ.. సమర్థవంతగా ప్రజాపాలన నిర్వహిస్తున్న ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు సరికావని వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అభిషేక్‌కెనడీ, నర్సింగ్‌రావు, గుండు జగదీశ్‌బాబు, నరేందర్ యాదవ్, గుర్రం దినేష్, మజర్, హఫీజ్, దినేష్, ముష్రఫ్ పాల్గొన్నారు.

ఐదుగురు ఎస్సైల బదిలీ

చాదర్‌ఘాట్: చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ఐదుగురు ఎస్సైలు బదిలీ అయ్యారు. శ్రీనివాస్ బంజారాహిల్స్, రవిరాజు టాస్క్‌ఫోర్స్, తిరుపతి మారేడుపల్లి, పర్వేజ్ గాంధీనగర్ ట్రాఫిక్, బాగ్యా నాయక్ గుడిమల్కాపూర్ బదిలీ అయినట్లు ఇన్‌స్పెక్టర్ మురారి తెలిపారు.కొత్తగా ముగ్గురు ఎస్సై వచ్చారని, సురేష్‌రెడ్డి సైఫాబాద్, కల్పన బోయినపల్లి, బొల్లమ్ కృష్ణారెడ్డి ఫలక్‌నామా పీఎస్ నుంచి వచ్చారన్నారు.

భవన నిర్మాణం..పునాదులకే పరిమితం

- ఉన్న భవనం నేలమట్టం చేసిన పాలకులు
- సీతాఫల్‌మండిలో విద్యార్థుల ఇబ్బందులు



పాఠశాల, కళాశాలల కోసం నిర్మించనున్న భవన నమూనా చిత్రం



రేండేళ్లుగా పునాది రాళ్లకే పరిమితమైన విద్యాసంస్థల భవన నిర్మాణం

సికింద్రాబాద్: కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. తరగతులు ప్రారంభం కావడంతో అన్ని ప్రాంతాల విద్యార్థులు నూతనోత్సాహంతో ఉండగా సీతాఫల్‌మండి ప్రాంత విద్యార్థులకు మాత్రం కష్టాలు ఈ విద్యా సంవత్సరం కూడా వ్యయప్రయాసలు తప్పేట్టు లేవు. అధునాతన పాఠశాల భవన నిర్మాణం పేరుతో ఉన్న భవనాన్ని నేలమట్టం చేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే రెండు విద్యా సంవత్సరాలు బయటి ప్రాంతాల్లో విద్యాభ్యాసానికి వెళ్లిన విద్యార్థులు ఈ ఏడాది కూడా అవే ఇబ్బందులు భరించాల్సి వచ్చింది.

- సీతాఫల్‌మండిలో విశాలమైన స్థలంలో అన్ని విధాల వసతులు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండేది. కొద్ది సంవత్సరాల క్రితం సీతాఫల్‌మండికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ, జూనియన్ కళాశాలలను ఇదే పాఠశాల భవనంలో ఏర్పాటు చేశారు. రెండు కళాశాలలకు, పాఠశాలకు తరగతి గదులు సరిపోక అప్పటి నుంచే విద్యార్థులకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి.

అధునాతన భవనాల పేరుతో....

పాఠశాల, కళాశాలల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఇక్కడ మూడు విద్యాసంస్థలకు కలిపి అధునాతన భారీ భవనాన్ని నిరిృంచేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 29.75 కోట్ల నిధులు మంజూరు చేసింది.

- కొత్త భవనాల నిర్మాణం కోసం సీతాఫల్‌మండిలోని విశాలమైన ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలను మొత్తంగా నేలమట్టం చేశారు. 2023 మార్చిలో పాఠశాల భవనాన్ని, ఆవెనుకే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని నేలమట్టం చేశారు. అదనపు గదుల నిర్మాణం కోసం పాఠశాల ప్రాగణంలో విశాలమైన స్థలం ఉన్నప్పటికీ భారీ భవనం నిర్మిస్తామని నేలమట్టం చేశారు.

తరగతులు చెల్లా చెదురు...

ఇక్కడి ప్రాథమిక, ఉన్నత పాఠశాల తరగతులను ఓయూకు అనుబంధంగా ఉన్న మోడల్ స్కూల్ భవనంలోకి బదలాయించారు. ఒకే భవనంలో అటు ఓయూ మోడల్ స్కూల్ విద్యార్థులు, ఇటు సీతాఫల్‌మండి ప్రాథమిక, ఉన్నత పాఠశాలల తరగతులు నిర్వహిస్తుండడంతో ఇబ్బందిగా మారింది.

- సీతాఫల్‌మండి లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులను విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాత భవనంలోకి మార్చారు. ఇందులో అధ్యాపకులకు, తరగతులు, ప్రయోగశాల నిర్వహణకు ఎటువంటి సదుపాయాలు లేవు. అరకొర సదుపాయాల మధ్యే బోధనలు జరుగుతున్నాయి.
- మేడిబావి కమ్యూనిటీహాలులో జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. కేవలం నాలుగు గదుల్లో అన్ని కోర్సుల బోధనలు నిర్వహించక తప్పని పరిస్థితి ఈ భవనంలో నెలకొంది. విద్యార్థులు, అధ్యాపకులకు అన్నీ అవే గదులు ఉండడంతో ఇక్కడ గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి.

పునాది గోడలకు పరిమితం...

పాఠశాల భవనాన్ని నేలమట్టం చేసి కొత్త భవన నిర్మాణం పనులు ప్రారంభించి రెండేళ్లు దాటింది. పాఠశాల కూల్చివేతతో అధునాతన భవనం వస్తుందన్న స్థానికుల ఆనందం ఆదిలోనే ఆవిరైంది. కొత్త భవన నిర్మాణం అలా మొదలయ్యాయో లేదో శాసనసభ ఎన్నికలు వచ్చాయి. ఆ తరువాత పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయి. ప్రభుత్వం మారడంతో ఏకంగా పాఠశాలను నేలమట్టం చేసిన కాంట్రాక్టర్ పునాది గోడలు నిర్మించి చేతులెత్తేశాడు.

సీతాఫల్‌మండి విద్యార్థుల సంఖ్య	
ప్రభుత్వ ప్రాథమిక	
ఉన్నత పాఠశాల	: 750
జూనియర్ కళాశాల	: 475
డిగ్రీ కళాశాల	: 575

సీఎం దృష్టికి తీసుకెళ్లాం



గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయం, పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిచిపోయిన తీరును ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవలి శాసనసభ సమావేశాల్లో సీఎంకు వినతిపత్రం అందించాం. నిర్మాణ పనులు పూర్తిచేయించేందుకు సీఎం హామీ ఇచ్చారు. మరోమారు పరిస్థితిని సీఎం, అధికారులకు వివరించి వచ్చే విద్యా సంవత్సరంలోగా భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.

–ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం



స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఛైర్మన్ ప్రకాశరావు తదితరులు

చిలకలగూడ : నామాలగుండు కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్న స్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ ఛైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిర దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల కోరిక మేరకు ప్రతి నెల రెండవ శనివారం స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్నామని ఛైర్మన్ ప్రకాశరావు తెలిపారు. కరాటే రాజు, బిట్ల రఘునందన్, శ్రీనివాసగౌడ్, సతీష్, కృష్ణచారి, రవిలతోపాటు పెద్దసంఖ్యలో భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పదవీ విరమణ



విజయను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: గోదావరిఖని గవర్నమెంట్ ఏరియా ఆసపత్రిలో చీఫ్ నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్–1 ఉద్యోగి భోజనపల్లి విజయగంగపుత్ర పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆమెను సన్మానించారు. 39 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందించి అందరిని మనన్నలు పొందారన్నారు. కరోనా సమయంలో ప్రజలందరికీ ప్రభుత్వం అందించిన వాక్సిన్‌లు అందించి వారిలో ధైర్యం నింపారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సరోజాముఠాగోపాల్, గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మదేశి రాజేందర్, ముషీరాబాద్ నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు మదేశి కళావతి, రసకట్ల పుష్పలీలా, మదేశి శంకరమ్మ, ఆటీకేటి రాజేష్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాజరాజేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పూజలు చేస్తున్న శంకర భారతి

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయ 19వ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా ముగిశాయి. పుష్పగిరి శంకర భారతీ మహా స్వామి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. శాంతి హోమం, మండప దేవత హోమాలు, అష్టోత్తర శతకళాభిషేకం, మహా పూర్ణాహుతి, వేదపండితుల ఆధ్వర్యంలో స్వస్తి తదితర పూజా కార్యక్రమాలతో ముగిశాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, గున్నాల ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా?



ముషీరాబాద్ డివిజన్ ఫ్రెండ్స్ కాలనీలో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లల్లో మట్టి తొలగించారు. పనులు పూర్తయిన అనంతరం మ్యాన్‌హోల్‌పై మూత పెట్టకుండా వదిలేయడంతో వాహనదారులు, స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదవశాత్తు చిన్న పిల్లలు అందులో పడితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. – ముషీరాబాద్

సమస్యల పరిష్కారానికి పోరాడాలి



మాట్లాడుతున్న దీన్‌దయాల్‌రెడ్డి

ముషీరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ నాయకులు కృషి చేయాలని భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ బూత్‌స్థాయి సమావేశం రంగానగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు ప్రతి నెల పోలింగ్‌బూల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి, ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో చనిపోయిన వారికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్‌గౌడ్, గోవింద్‌రాజ్, మగ్బూల్, ప్రవీణ్‌కుమార్, కృష్ణ, మహేష్, కళ్యాణ్, అజీపాషా పాల్గొన్నారు.

రైల్లో ప్రయాణికురాలి బ్యాగ్ చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణికురాలి బ్యాగు చోరీకి గురైన ఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బెంగుళూర్‌కు చెందిన కాంచన సింగ్లీ (62) కాచిగూడకు వచ్చేందుకు మహారాష్ట్రలోని జాలాలో రైలు ఎక్కింది. నాందేడ్ రైల్వే స్టేషన్ వద్ద చూసుకునే సరికి తన హ్యాండ్‌బ్యాగ్ కనిపించలేదు. బ్యాగులో 8గ్రాముల గోల్డ్ చైన్, రూ.21 వేలు, సెల్‌ఫోన్ ఉంది. బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

బీఆర్ఎస్ బలోపేతానికి పాటు పడాలి

చిక్కడపల్లి: బీఆర్ఎస్ పార్టీని బూత్ స్థాయినుంచి పటిష్టం చేయాలని ఆ పార్టీ గాంధీనగర్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్ సూచించారు. గాంధీనగర డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం శనివారం జవహర్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ .. ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త, నాయకుడు పార్టీ బలోపేతానికి పాటు పడాలన్నారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గాంధీనగర్ డివిజన్‌లో విజయం సాంధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ముఠా నరేష్, పున్న సత్యనారాయణ, పాశంరవి, వెంకటేష్, శివసింహ, కృష్ణ ప్రసాద్, కిరణ్, నవీన్, కుమార స్వామి పాల్గొన్నారు.

గో సంరక్షణలో భాగస్వాములవ్వాలి



కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు

కవాడిగూడ: గోవుల సంరక్షణలో భాగస్వాములు కావాలని వాసవీక్లబ్ సికింద్రాబాద్ ప్రతినిధులు అన్నం సాయిసునిత, పల్లా నరేందర్, పి.జగన్, కిషోర్, మరిపెల్లి సుదాన్య పిలుపునిచ్చారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని శివాలయంలో శనివారం వాసవీ క్లబ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉదయాస్తమాన సేవ కార్యక్రమంలో భాగంగా గోవులు ఆరోగ్యంగా ఉండేలా గోషాలలో గరుకు స్తంభస్థావన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవడానికి సేవా కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గోవధను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మురారి శెట్టి కేశవరాజు, వెంకటేష్, ప్రవీణ్, నవీన్, ఉదయ్ శర్మ, మహేష్, సిహెచ్ గోపాల్, సి.రమేష్ గౌడ్ మనోజ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పెంపు తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి

కాచిగూడ: తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో చొరవ చూపాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి: వడ్డెరుల సమస్యలు పరిష్కరించాలని ఎంబీసీ కార్పొరేషన్ ఛైర్మన్ జెరిపేటి జైపాల్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ను కలి విపతి పత్రం అందజేశారు. వడ్డెరులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెరిపేటి సత్యనారాయణ రాజు, అంతయ్య, కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, రాములు, సత్యనారాయణ, గణేష్, వెంకటకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమానికి కృషిచేస్తా



చిక్కడపల్లి: ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని సీనియర్ నాయకుడు సి.వెంకటగోవిందరావు అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా శనివారం వెంకట గోవిందరావును సంఘ సేవకులు, రాజకీయ వేత్త ఎండీ మహ్మమూద్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ.. తన సేవలను గురించి పార్టీ మంచి గుర్తింపు ఇచ్చిందన్నారు.

ప్రతి ఏటా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం

చిక్కడపల్లి: వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థుల భవిష్యత్ ఎంతో దోహదపడుతాయని కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు ప్రముఖ నాట్యగురువు డాక్టర్ ఎస్‌పీ భారతి అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలో ఎస్‌పీ భారతిని సన్మానించి సత్కారించారు. ఈ సందర్భంగా భారతి మాట్లాడుతూ.. కూచిపూడి నాట్య అంశంపై వేసవి శిక్షణ శిబిరాలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామన్నారు. శిబిరాల్లో శిక్షణ పొందిన వర్ధమాన కళాకారులు నేడు ఎంతో గొప్పగా రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్‌రెడ్డి, బత్తిన రాజమౌళి, డాక్టర్ మహేశ్వర్, లతా మాధురి, మనోజ్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

చిక్కడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్తగా చేరిన పిల్లలకు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ శనివారం అక్షరాభ్యాసం చేయించారు. అమ్మ ఒడి, అంగన్‌వాడీ కార్యక్రంలో భాగంగా జవహర్‌నగర్ కమ్యూనిటీ ఆవరణలో ఉన్న కేంద్రంలో కార్యక్రమాన్ని ప్రారంభించి పిల్లలతో అక్షరాభ్యాసం చేయించిన పావనివినయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నపిల్లలకు మొదటి విద్యాభ్యాసం మొదలవుతుందని పిల్లలకు విద్యాతో పాటు ఆటలు, పాటలు, రైమ్స్ నేర్పడమే కాకుండా ప్రతి రోజు పౌష్టికాహారం అందిస్తారని ప్రైవేటు స్కూళ్లకు మంచి ఉచితంగా పిల్లలకు మంచి విద్యాభాసాన్ని అంగన్‌వాడీలో అందజేస్తున్నారన్నారు.

పిల్లలతో పాటు గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహం అందుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వై.నర్సమ్మ, డి.ప్రమీల, కౌసర్‌బేగం, సబిత, ఆయా మాణికమ్మ పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

చిక్కడపల్లి: ఓబీసీలు రాజ్యాధికారం సాధన దిశగా ముందుకు సాగాలని చేనేత సామాజిక చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కాదేవదాసు అన్నారు. ఐఏఎస్ అధికారి పి.నరహరి, న్యాయవాది పృథ్వీరాజ్ సింగ్ పరమల్ రచించిన ఓబీసీల పోరుబాట పుస్తకావిష్కరణ ఇటీవల జరిగింది. ఈ పుస్తకాన్ని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి దేవదాసు పలువురికి ఉచితంగా అందజేశారు.

కృతజ్ఞతలు



ముషీరాబాద్: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్ శనివారం రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు.తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్‌యాదవ్‌లకు ఆమె కృతజ్ఞతలు పారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: డివిజన్ అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తిలేదని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి అన్నారు. వాటర్ ట్యాంక్ నుంచి రేషన్ దుకాణం వరకు రూ.21 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. అంతర్గత రోడ్లపై దృష్టి సారించామని సమస్యలు పరిష్కరించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నందు, బాబురావు,సురేందర్, ఆందాళ్, సంపత్, అశోక్, స్వామి, దేవేందర్, నవీన్ పాల్గొన్నారు.

తల్లీకుమారుడు అదృశ్యం

గాంధీఆస్పత్రి : రెండేళ్ల కుమారునితో సహా తల్లి అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణం గాంధీనగర్‌కు చెందిన ప్రశాంత్, స్వప్నలు భార్యభర్తలు. వీరికి రెండేళ్ల కుమారుడు అభిలాష్ ఉన్నాడు. ప్రశాంత్ కాలికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం గతనెలలో గాంధీఆస్పత్రిలో చేర్పించారు. భార్య స్వప్నతోపాటు కుటుంబసభ్యులు సేవలు అందించారు. ప్రశాంత్ కాలుకు అయిన గాయం తీవ్రం కావడంతో సర్జరీ చేసిన వైద్యులు అతని ఎడమకాలిని తొలగించారు. ఈ క్రమంలో భార్య స్వప్న ఊరికి వెళ్లి డబ్బు తెస్తానని చెప్పి కుమారుడిని తీసుకొని ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లింది. ఈనెల 3వ తేదిన ప్రశాంత్ డిశ్చార్జ్ అయి ఊరికి వెళ్లగా స్వప్న అక్కడకు రాలేదని తేలింది. పలు ప్రాంతాల్లో గాలించినప్పటికీ స్వప్న(25), కుమారుడు అభిలాష్ (2) ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు శనివారం చిలకలగూడ పోలీసులను ఆశ్రయించారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, తల్లికుమారుల ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పోలీసులు కోరారు.